# కాలం మారినా

"నాన్నా! సర్కస్ వచ్చింది నాన్నా! నా స్నేహితురాళ్లంతా చూద్దామంటున్నారు. నాక్కూడ డబ్బులివ్వండి".

"సీతా! నువ్వింకా చిన్నపిల్లవేనా! పదకొండు పోయి పన్నెండు వస్తున్నది- ఇంకా సర్కసులు- తోలు బొమ్మలాటలు ఏమిటి? ఆడపిల్ల బుద్ధిగా ఇంట్లో కూర్చొని ఏ రామాయణమో-భారతమో చదువుకోవాలి.

పోమ్మా!"

"అమ్మా! నాన్నకు నువ్వన్నా చెప్పవే! ఓ కాని చాలు-"

"తప్పమ్మా! నాన్నగారి మాటలకు ఎదురు చెప్పకూడదు- సర్కస్‌కి పోకిరీపిల్లలొస్తారు- మన జాగ్రత్తలో మనం ఉండాలి".

"హూ! డబ్బు లివ్వడం ఇష్టం లేదని చెప్పండి"

"పోన్లే! అదే అనుకో! ఆడపిల్ల పుడితేనే ఖర్చు-పెళ్లికి ఖర్చు-పేరంటానికి ఖర్చు-సీమంతానికి ఖర్చు-పురుడుకు ఖర్చు."

"అమ్మా! ఇన్ని ఖర్చులు చెప్పేకన్నా పుట్టగానే గొంతు నులిమి పారేయాల్సింది".

"సీతా! ఏమిటా నోరు పారేసుకోవడం- లోపలికి పోయి ఇంట్లో పనిచూడు".

"అయితే నాన్నా. నాకు..."

"అయితే లేదు - గియితే లేదు - నోర్మూసుకుని ఫో!"

❋ ❋ ❋ ❋ ❋

"అమ్మా! పట్టు చీరెలు చాలా బాగున్నాయి. కొనుక్కుంటాను... నాన్నగారిని డబ్బులిమ్మనవే!"

"ఛీ! ఎప్పుడూ చీరెల పిచ్చే!"

"నువ్వేగా పెళ్లి కావలసినపిల్ల - కాస్త నదరుగా ఉండాలంటావు - ఎలాగూ నన్ను యూనివర్సిటీలో చేర్పించలేదు - ఖర్చవుతుందని".

"అందుకని చీరెలమీద డబ్బులు తగలెయ్యమంటావా?"

"కాదమ్మా! పట్టుచీరె - ఒకే ఒక కంచి పట్టుచీరె - కొనుక్కుంటాను"

"అమ్మా! సీతా! నీకు వయసు వచ్చింది కానీ బుద్ధి రాలేదు - రేపు నీకు పెళ్లి చెయ్యాలి - అప్పుడు కొనాలిగా - మళ్లీ ఇప్పుడెందుకు - నాన్నగారేం ఎడా పెడా సంపాదించడం లేదు ఇలా తగలెయ్యడానికి."

"మరి అన్నయ్యకు ఎంతైనా ఇస్తారుగా ప్యాంట్లు, షర్టులు కుట్టించుకోమని - వాడి కోసం డబ్బులెలా వస్తాయి."

"నోర్మూయ్! చిన్నంతరం, పెద్దంతరం లేకుండా ఏమిటా వాగుడు! వాడు మొగవాడు - చదువుకుంటున్నవాడు - నలుగురిలో తిరగవలసినవాడు - నలుగురిలోనూ నామర్ధాకాదూ - మంచి డ్రస్సు లేకపోతే."

"అంతే - ఈ దేశంలో ఆడపిల్లగా పుట్టడం నాదే బుద్ధితక్కువ."

❋ ❋ ❋ ❋ ❋

"ఏమిటి? నీ జీతం వంద తగ్గింది శ్రీమతిగారు ఏం చేసారు!"

"కంగారు పడకండి.. నేనేం ఖర్చు చెయ్యలేదు. మా కొలీగ్ అప్పు అడిగితే ఇచ్చాను."

"సీతా! ఎందుకిచ్చావు? అంతా నీ పెత్తనమేనా? మొగుడ్ని నేను ఉన్నానన్న జ్ఞానం ఉందా నీకు? నాకు చెప్పనవసరంలేదు అనుకున్నావా?"

"ఏమండీ! ఇందులో ఏం తప్పుందండీ? నేను ఇచ్చింది అప్పేగా! చాలా అవసరమంటే మా గీతకిచ్చాను."

"హు! నా తలరాత! ఇస్తావే - ఇస్తావు-ఇవాళ వంద అవసరం అంటుంది-రేపు రెండొందలు కావాలంటుంది - ఓ నెల తర్వాత వెయ్యి అడుగుతుంది నీకేం యిచ్చేస్తావు - కరుణామయివి -స్నేహం -స్నేహమాధుర్యం కారిపోతోంది."

"ఇదేమిటండీ - నేనేం మీ డబ్బులివ్వలేదే! కష్టపడి సంపాదించిన నా జీతంలోంచి ఇచ్చాను. నా జీతంలో ఒక వంద రూపాయలు ఖర్చుచేసే అర్హత లేదా నాకు ?"

"నోర్ముయ్! నీ జీతమా! కళ్లు నెత్తికొచ్చాయా? నీ జీతం నీ ఇష్టమేనే. అందుకే ఆడది గడప దాటకూడదని అన్నారు. బోడి ఉద్యోగం చేసినంత మాత్రాన జీతమంతా నీ ఇష్టమొచ్చినట్లు ఖర్చుపెడతావా? నేనూ చేస్తున్నాను నా జీతం గుర్రప్పందాలకూ -పేకాటకు తగలేస్తే ఇల్లెలా గడుస్తుంది?"

"ఇద్దరం కష్టపడాలికానీ నా జీతం నా ఇష్టం అంటే కుదరదు."

"అయ్యోరామ! ప్రతి నెల నా జీతమంతా తెచ్చి మీకే ఇస్తున్నాకదండి- ఈ ఒక్కసారే ఇలా అయింది. ఏదో అవసరం అంది కదా అని ఇచ్చాను."

"ఆ! మహా ఇచ్చావులే - ఇచ్చినట్లే యిచ్చి పై ఖర్చులకు అని యాభై చొప్పున గుంజుకుపోతావు. ఇంకెప్పుడూ ఇలాంటి పిచ్చిపనులు చెయ్యకు - ఇదే లాస్టు వార్నింగ్! నాకు నచ్చదు."

"అంతా నా ఖర్మ! నేను సంపాదించవచ్చుగానీ - నా సంపాదన మీద నాకు హక్కులేదు".

"మరీ ఎక్కువగా వాగకు! అంత కష్టంగా వుంటే వెళ్లిపో! రేపీపాటికి ఇంకోదాన్ని పెళ్లి చేసుకుంటాను - మగ మహారాజుని నాకేం-"

"అయినా నాది బుద్ధి తక్కువ! ఆడజన్మ అని మర్చిపోయాను."

❋ ❋ ❋ ❋ ❋

"బాబూ! చెల్లెలికి సంబంధాలొస్తున్నాయి. ఈ శ్రావణంలో చేసేద్దాం"

"నువ్వూరుకోమ్మా! నా ప్రొబేషన్ పూర్తికావాలి! మనం ఇల్లు కట్టుకోవాలి - అప్పుడే దాని పెళ్లి."

"ఒరే! అన్నగా ఆలోచించరా! ఆయన చనిపోయిన తర్వాత వచ్చిన ఆ నాలుగు డబ్బులు నువ్వే ఖర్చుచేస్తే రేపు దాని గతి ఏం అవుతుంది - నా పెన్షన్ డబ్బులా ఇంకా రాలేదు"?

"అమ్మా! నువ్వేం కంగారుపడకు - లోకం నీకేం తెల్సు. మంచి చదువు చదువుకుని - మంచి పొజిషన్‌లోకొస్తే చెల్లెలికి సంబంధాలు అవే వస్తాయి. ఈ లోగా నేను ప్రమోషన్ తెచ్చుకుంటానుగా"

"బాబూ! నేను - అది కల్సి సిన్మాకి వెళ్లొస్తాం".

"ఈ వయసులో నీకిదేం పిచ్చమ్మా! అనవసరంగా డబ్బులు సిన్మాలకని తగలేస్తారు"!

"సరేలే! కనీసం టెలివిజన్ అన్నా కొన్నావుకాదు".

"టీ. వీలో ఏముంటుందమ్మా! కృష్ణా, రామా అనుకుంటే పుణ్యం పురుషార్థం! అయినా

చూద్దాంలే"!

"హు! నాకే చెప్పేటంతటి వాడివయ్యావు. అవును. మగపుటుక నీది. అందుకే తల్లిమీదే పెత్తనం చెలాయిస్తావు."

"బాబూ! చిరంజీవి!"

"ఏం నానమ్మా!"

"మీ నాన్నేం చేస్తున్నాడురా"?

"ఆఫీసు వాళ్లువస్తే మాట్లాడుతున్నాడు".

"నాకో సాయం చేసి పెడతావురా పిచ్చికన్నా".

"ఏంటి నానమ్మా!"

"నాకు రామాయణం, భారతం చదువుకోవాలి అని ఉందిరా - ఆ గ్రంథాలు కొనిమ్మని మీ నాన్నకు చెప్పరా. నేనెప్పుడు అడిగినా - ఈ వయసులో నీకెందుకు శ్రమ - కళ్లు దెబ్బతింటాయి - అంటాడు -నువ్వన్నా చెప్పరా చిరంజీవి".

"అలాగే నానమ్మా! నాన్నతో చెప్పి కొనిపిస్తాను."

❁ ❁ ❁ ❁ ❁

"నాన్నమ్మా! ఇది అన్యాయం - నీ ఆస్తి అంతా అన్నయ్యకే రాశావు. సగం నాకెందుకు రాయలేదు..?

"పిచ్చిదానా నువ్వు ఆడపిల్లవు. నీకెందుకే"?

"హు! ఈ కాలంలో కూడా ఆడ మొగ తేడానా?"

"తరాలు మారినా, కాలాలు మారినా ఆడది ఆడదే! నీకు ఆస్తి రాస్తే ఆ వచ్చేవాడు అనుభవిస్తాడు."

"అయితే అన్నయ్యకు రాసినా వదిన అనుభవించదా"?

"పిచ్చి పిల్ల! నేను చచ్చిపోయిన తర్వాత నా మొహాన్న యింత పిండం పడేసేది ఆ మొగ మగారాజేనే - మీ వదిన వచ్చినా ఈ యింటి కోడలుగా వస్తుంది".

"చేసిన అన్యాయాన్ని ఎలాగయినా సమర్థించుకోవచ్చు".

"పాపా! నీకింకా అనుభవం రాలేదమ్మా! ఆడది ఎల్లకాలం ఆకుచాటు పిందేనమ్మా! మల్లె తీగకి పందిరి కావాలి. మల్లెకి పందిరి అవసరం కానీ - పందిరికి ఆధారం మల్లెకాదమ్మా!"

"ఛీ! ఈ ఆడబ్రతుకు ఎప్పుడు మారుతుందో!'?'

ఆదివారం ఆంధ్రభూమి